క్లుప్తంగా

మారెమ్మ విగ్రహ ప్రతిష్ట



కంబదూరు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మారెమ్మ దేవాలయంలో మంగళవారం నూతన మారెమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామస్తులందరూ భక్తి శ్రద్ధలతో మారెమ్మకు జ్యోతులు,బోనాలను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాగ్రత్తలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ

రాయదుర్గంటౌన్: చిన్నపాటి జాగ్రత్తలతో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందొచ్చని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం స్వచ్ఛ-స్వస్థ రాయదుర్గంలో భాగంగా పట్టణంలోని కోట మారెమ్మగుడి ఏరియాలో సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కాలనీవాసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య పర్యవేక్ష కులు శాంతకుమారి, లక్ష్మీనరసమ్మ, శానిటరీ సెక్ర టరీ వెంకటేష్, హెల్త్ సెక్రటరీలు శైలజ, సునీత, సుజాత, అరుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోండి

- రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి



రాయదుర్గం: రాయదుర్గం నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాలకు వరి, పత్తి, మొక్కజొన్న, ఉల్లితో పాటు పలు చోట్ల ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, నష్టపోయిన ప్రతి రైతుకూ తగిన పరిహారం ఇచ్చి ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బొమ్మనహాళ్ మండలంలో చిన్న హగరి నది ఉధృతంగా ప్రవహించిందన్నారు. వర్షాకాలంలో ఇదే పెద్ద వంకగా రైతులు గుర్తించారన్నారు. హగరి పరీవాహక ప్రాంతమైన ఏలంజి, మైలవరం, కొలగానహళ్లి, కృష్ణాపురం తదితర గ్రామాల్లో సుమారు వందలాది ఎకరాల్లో పంటలు తుడిచిపెట్టుకుపోయాయన్నారు. రెండు రోజులుగా నీటిలోనే పంట పొలాలు ఉన్నాయన్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం తీసుకెళ్తామన్నారు. నష్ట నివారణ చర్యలు చేపట్టి రైతులకు అండగా నిలవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మహబూబ్ సుభాని జెండా కట్ట వద్ద గౌసేపాక్ గ్యార్మీ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, డీఎస్పీ రవిబాబు, సీఐలు జయానాయక్, వెంకటరమణ, అబ్దుల్ వహాబ్ జామిఖాదిరి హాజరయ్యారు. ఫాతెహా, ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వలిబాష, బాలరాజు,బర్కత్ షావలి దర్గా కమిటీ సభ్యులు, బ్రెడ్ సర్మాస్, లడ్డూ షఫీ, అబూబకర్, ఖాజీ సైఫుల్లా, ఖాజాపీరా పాల్గొన్నారు.

ఇక ప్రభుత్వ భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం



నూతనంగా కేటాయించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

బ్రహ్మసముద్రం : పడమటి కోడిపల్లి గ్రామంలో చాలా ఏళ్ల నుంచి అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇటీవల దళిత కాలనీ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలోకి రానీయకుండా బయటే కూర్చోబెట్టి, వివక్ష చూపిన విషయం విదితమే. దీనిపై ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అదనపు గది కేటాయించి, అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు సూచించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ తెలిపారు.

ప్రశాంతతపై ప్రతీకారం

కర్ణాటకకు సరిహద్దున ఉన్న రాయదుర్గం ప్రాంతం ప్రశాంతతకు మారుపేరుగా ఉంది. అయితే ఇటీవల కాలంలో వరుస హత్యలు, ఆత్మహత్యలతో ప్రజలు హడలెత్తుతున్నారు. మూడు నెలల వ్యవధిలోనే ఏకంగా ఏడుగురు కత్తి, గొడ్డలి వేటుకు బలి కావడం ఆందోళన కలిగిస్తోంది. దారుణ హత్యలు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి. ఒకదాని వెంట ఒకటి వెలుగు చూస్తుండడంతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు తంటాలు పడాల్సి వస్తోంది. రాయదుర్గంలో కొల్లారప్ప హత్యకేసు ఛేదించేందుకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో సుమారు 60 మందికిపైగా అనుమానితులను విచారించినట్టు సమాచారం.

– రాయదుర్గం:

- హడలెత్తిస్తున్న వరుస హత్యలు
- మూడు నెలల్లోనే కత్తికాటుకు ఏడుగురి బలి
- 'దుర్గం'లో క్షీణిస్తున్న శాంతిభద్రతలు
- ఛిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు
- పోలీసులకు సవాలుగా మారుతున్న వరుస హత్యలు



» జూలై 9న గొల్ల ఆదెప్ప అనే వ్యక్తి పాతకక్షలతో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో చాలామంది అమాయకులు ఇరుక్కొని శిక్ష అనుభవించారని బాధిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

» రాయదుర్గం పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో ఆగస్టు 6న వివాహేతర సంబంధంతో పార్వతి అనే మహిళపై అదే కాలనీలో నివాసం ఉంటున్న తాపీ మేస్త్రీ మోహన్ పెట్రోల్ పోసి నిప్పటించాడు. 60 శాతం కాలిపోయిన ఈమెను స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. తల్లిదండ్రులు ఇద్దరూ దూరం కావడంతో కుమారుడు అనాథగా మారాడు.

» రాయదుర్గం పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న కొల్లారప్పను అక్టోబర్ 1న సహచరులే దారుణంగా మట్టుబెట్టారు. ఉద్యోగం విషయంలో దాస పవన్, దాస మధుసూదన్ అనే ముగ్గురి మధ్య తలెత్తిన విభేదం హత్యకు కారణమైంది. చిన్న తనంలోనే తల్లిని పోగొట్టుకున్న కుమార్తెకు ఆలనా, పాలనాగా చూసుకునే తండ్రి మరణంతో అనాథగా మారింది.

» గుమ్మఘట్ట మండలం కలుగోడులో కట్టుకున్నోడే కాలయముడయ్యాడు. భార్య జ్యోతమ్మపై గత కొంతకాలంగా అనుమానం పెంచుకున్న భర్త వన్నూరుస్వామి సెప్టెంబర్ 29న తెల్లారే సమయంలో నోట్లో గుడ్డ కుక్కి కత్తితో గొంతుకోసి చంపేశాడు. దీంతో ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు అనాథలుగా మారారు.

» గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డికి చెందిన సరిత అనే డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద ప్రేమోన్మాది చేతిలో గొడ్డలి వేటుకు బలైంది. బస్సులో అనంతపురానికి వెళుతుంటే జే వెంకటంపల్లికి చెందిన యువకుడు ద్విచక్ర వాహనంపై వెంబడించి ఆత్మకూరు వద్ద దించి, ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు.

» గుమ్మఘట్ట మండలం పూలకుంటలో నందిని అనే వివాహిత సెప్టెంబర్ 9న అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. బాత్‌రూమ్‌లో కాలుజారి పడిందని భర్త నగేష్, కుటుంబ సభ్యులు చెప్పంటే.. అత్తింటి వారే దారుణంగా చంపేసి, సాధారణ మరణంగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి తండ్రి వడ్డే రామాంజనేయులు వాపోయాడు.

» రాయదుర్గం మండలంలోని మల్లాపురం తండా సమీపంలో అక్టోబర్ 20న కన్న తండ్రినే కుమారుడు దారి కాచి హతమార్చాడు. పట్టణానికి చెందిన బొమ్మన్న కర్ణాటక రాష్ట్రం పెదరాగుడ్డం వద్ద పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా కొడుకు నాగరాజు కొడవలితో హతమార్చి, రోడ్డు ప్రమాదంగా అందరినీ నమ్మించాడు. పోస్టుమార్టంలో కత్తిగాట్లు కనిపించాయి. పోలీసుల విచారణలో హత్యగా నిర్ధారణ అయ్యింది.

వ్యక్తిగత కక్షలు సరికాదు

ప్రజలంతా స్నేహభావంతో మెలగాలి. వ్యక్తిగత కక్షల జోలికి వెళ్లరాదు. క్షణికావేశాలకు లోనై హత్యల దాక తీసుకెళ్లడం మంచిదికాదు. ఇప్పటి దాకా వెలుగుచూసిన హత్యకేసుల్లోని ముద్దాలను జైలుకు పంపాం. చట్టాన్ని చేతిలో తీసుకోవాలని చూస్తే ఎంతటివారైనా సరే కఠిన చర్యలు తప్పవు. పంతాలు, పట్టింపులకు వెళ్లడం, కుటుంబ తగాదాలు, ప్రేమోన్మాదులు, అనుమానంతో చంపుకోవడం సరైన పద్ధతి కాదు. ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా చట్టాలపై అవగాహన కల్పించాలి. జైలుకెళ్లి జీవితాన్ని నాశనం చేసుకుంటే నమ్ముకున్న కుటుంబం వీధిన పడుతుంది. సమస్య ఏదైనా సరే రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలి. లేదంటే పోలీసులను ఆశ్రయించాలి. అప్పుడే న్యాయం చేకూరుతుంది. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం. ఇందులో రాజీపడే ప్రసక్తేలేదు. – రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

క్షీణిస్తున్న శాంతిభద్రతలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలు దిగజారిపోతున్నాయి. రాష్ట్రంలోనే అత్యంత ప్రశాంతతకు మారుపేరుగా పిలవబడే రాయదుర్గంలో వరుసగా హత్యలు.. హింసాత్మక నేరాలతో పాటు వరుస దొంగతనాలు, పేకాట శిబిరాలు, మట్టి, ఇసుక మాఫియా రోజుకో చోట పుట్టుకువస్తున్నాయి. పోలీసులు ఓ వైపు కట్టడి చేస్తున్నా మరోవపు మారణాయుధాలతో వెంబడించడం, ప్రేమించలేదని యువతులపై దాడులకు తెగబడడం, కట్టుకున్న వాడు, కన్న కొడుకే కాలయముడై నిలవడం లాంటి ఘటనలను చూస్తే సమాజం ఎక్కడికి దారితీస్తుందోనని మేధావులు, యువత, ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

దంచికొట్టిన వాన

- డివిజన్‌లో 378.4 ఎంఎంగా వర్షపాతం నమోదు
- కళ్యాణదుర్గం, కంబదూరు ప్రాంతాల్లోనే అధిక వర్షాలు
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- బీటీ ప్రాజెక్టుకు పోటెత్తిన వరదనీరు
- సోములాపురంలో తెగిన చెక్‌డ్యాం పరిశీలించిన ఇన్‌చార్జ్ ఆర్డీఓ వినూత్న



ఒంటిమిద్దిలో కాలనీలోకి చేరిన నీరు



రాయదుర్గం వద్ద వర్షానికి తెగిన చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్డీఓ వినూత్న

కళ్యాణదుర్గం/రాయదుర్గం: రాయదుర్గం టౌన్: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి, మంగళవారం వేకువజాము వరకు వర్షం దంచికొట్టింది. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ వద్ద వేదావతి హగరి కాజ్‌వేపై పొంగి పొర్లింది. బొమ్మనహాళ్, కణేకల్లు, ఉరవకొండ ప్రాంతాల్లో వరి పొలాలు నీట మునిగాయి. డీ హీరేహాళ్ మండలం సోమలాపురం వద్ద పెద్ద చెక్‌డ్యాం అధికారుల నిర్లక్ష్యానికి తెగింది. అసిస్టెంట్ కలెక్టర్, కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ ఆర్డీఓ వినూత్న, తహసీల్దార్ అనిల్‌కుమార్, సిబ్బందితో కలసి తెగిన చెక్‌డ్యాంను పరిశీలించారు. కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు బీటీ ప్రాజెక్ట్ తొణకిసలాడుతోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,655 అడుగులు కాగా, మంగళవారం సాయంత్రానికి 1,652.4 అడుగులకు నీరు చేరాయి.

నమోదైన వర్షపాతం ఇలా..

కళ్యాణదుర్గం సబ్ డివిజన్ వ్యాప్తంగా 378.4 ఎంఎంగా వర్షపాతం నమోదైనట్టు డీవైఎస్‌ఓ రికార్డులు స్పష్టం చేశాయి. అత్యధికంగా కళ్యాణదుర్గంలో 89.4 ఎంఎం, గుమ్మఘట్టలో 4.8 తో అత్యల్పంగా నమోదైంది. శెట్టూరులో 31.8, కంబదూరులో 65.4, బ్రహ్మసముద్రంలో 39.2, కుందుర్పి 24.6, బెళుగుప్ప 25.6, రాయదుర్గం 45.2, డీ హీరేహాళ్ 24.0, కణేకల్లు 23.0, బొమ్మనహాళ్ 5.4, వజ్రకరూరు 5.4, ఉరవకొండ 12.4 ఎంఎంగా వర్షపాతం నమోదైంది.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సోమవారం రాత్రి వాన దంచికొట్టింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన పాత బస్టాండ్, ఎర్రనేలవీధి, ఒంటిమిద్ది ఎస్సీ కాలనీ, ముదిగల్లు రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. యర్రంపల్లి వద్ద చెక్‌డ్యాంలు నిండి చిన్న వాగు ద్వారా పాలవాయి చెరువులోకి వర్షపు నీరు చేరింది.

ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి హగరి

బొమ్మనహాళ్: మండలంలో రెండు రోజులుగా కుండపోతగా వర్షం కురుస్తుంది. వేదావతి హగరి నది ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామం వద్ద బళ్లారి-కళ్యాణదుర్గం రహదారి వంతెనపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొలగానహళ్లి, ఏలంజి, కానాపురం, బండూరు తదితర గ్రామాల్లో వందల ఎకరాలు నీట మునిగాయి. మొక్కజొన్న, పత్తి, మిర్చి, వరి పంటలు నీట మునిగాయి. కృష్ణాపురం వద్ద వరి పంట నేలకొరిగింది.

భారీ వర్షానికి దెబ్బతిన్న పంటలు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ప్రధాన కాలనీలన్నీ నీటమునిగాయి. కంబదూరు రోడ్డులోని వ్యవసాయ తోటలో టెంకాయ చెట్టుపై పిడుగు పడింది. దీంతో టెంకాయ చెట్టు పూర్తిగా దెబ్బతినింది. ఒంటిమిద్ది గ్రామంలో రైతు ఎర్రిస్వామికి చెందిన రెండు ఎకరాల మొక్కజొన్న పంట నేలమట్టం అయ్యింది.



బొమ్మనహాళ్: వంతెనపై వరద నీరు ప్రవహిస్తుండటంతో నిలిచిపోయిన రాకపోకలు



కల్లుదేవనహళ్లి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



రాయదుర్గం: సోములాపురం వద్ద తెగిపోయిన చెక్‌డ్యాం

అక్రమాలకు పాల్పడితే చర్యలు



కూడేరు: కుడికాలువలో పూడిక తీత పనులను పరిశీలిస్తున్న పీడీ సలీంబాషా

కూడేరు: ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనుల్లో అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్(పీడీ) సలీం బాషా సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం ఆయన కూడేరులో ధర్మవరం కుడికాలువలో ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న కంప చెట్ల తొలగింపు, పూడిక తీత పనులను పరిశీలించారు. కూలీల హాజరుకు సంబంధించి మస్టర్‌ను పక్కాగా నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం రైతు కృష్ణకుమార్ పొలంలో పండ్ల మొక్కల సాగులో భాగంగా చీనీ మొక్కలు నాటి నీరు పోశారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, జేఈ రవి కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్ శిరీషా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకులు మృతి

కూడేరు: స్థానిక శివరాంపేట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కూడేరుకు చెందిన దామోదర్, ఆత్మకూరు మండలం సింగంపల్లికి చెందిన అశోక్ (24) , నెల్లూరుకు చెందిన వినోద్ (23) తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం వినోద్ మృతి చెందాడు. అశోక్‌ను మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఈ ముగ్గురు ముద్దలాపురం వద్ద ఉన్న సుజలాన్ గాలి మరల కంపెనీలో పని చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

కణేకల్లు: ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు సూచించారు. మండలంలో మూడ్రోజుల పాటు నిర్వహించనున్న ఆధార్ క్యాంపులను స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం ప్రారంభించారు. తొలిరోజున విద్యార్థుల, పేర్లలో సవరణలు, డేట్ ఆఫ్ బర్త్, అడ్రస్, వేలిముద్రల అప్‌డేట్ లాంటివి చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. బ్రహ్మసముద్రం, బెణికల్లు, యర్రగుంట, జక్కలవడికి, గెనిగెర గ్రామ ప్రజల సౌకర్యార్థం యర్రగుంట-1 గ్రామ సచివాలయంలో బుధవారం రోజు ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. పులచెర్ల, రచ్చుమర్రి, మాల్యం, కళేకుర్తి గ్రామ ప్రజల సౌకర్యార్థం గురువారం రోజున మాల్యం గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రాయదుర్గంటౌన్: మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నుంచి నాలుగురోజుల పాటు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని పార్వతినగర్ ఒకటో వార్డు సచివాలయం, డ్రైవర్స్ కాలనీలోని 9వ వార్డు సచివాలయంలో ఈనెల 25వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మెరుగైన సేవలు అందించండి



ఓపీ రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ వినూత్న

కళ్యాణదుర్గం: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఇన్‌చార్జ్ ఆర్డీఓ బి.వినూత్న వైద్యులకు సూచించారు. మంగళవారం కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వార్డులలో అడ్మిట్ అయిన రోగులకు అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రసన్నభారతి, డాక్టర్లు జమీలా, పవన్‌కుమార్, దామోదర్, శశికళ, అస్మా, సాయి చరణ్, శివకుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

అధిక వర్షాలతో తెగుళ్లు

కళ్యాణదుర్గం రూరల్: అధిక వర్షాలకు ఉద్యాన పంటలకు తెగుళ్ల సోకే అవకాశం ఉందని, జాగ్రత్తలు పాటిస్తే పంటలను రక్షించుకోవచ్చని కళ్యాణదుర్గం డివిజన్ ఉద్యాన అధికారి కృష్ణతేజ తెలిపారు. మంగళవారం బోరంపల్లి గ్రామంలో కృష్ణతేజ పర్యటించారు. టమాట, అరటి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వీహెచ్‌ఏ రమ్య పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్లు రిపేరీ చేయించండి

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లను మరమ్మతు చేయించాలని, రేకులషెడ్లలో నిర్వహిస్తున్న ప్రైవేట్ స్కూళ్లను సీజ్ చేయాలని విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాయదుర్గానికి వచ్చిన డిప్యూటీ డీఈఓ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగిశివ, ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు మాధవ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొట్రేష్ మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో వాటర్‌ప్లాంట్లు పనిచేయలేదన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని మేధా స్కూల్, పట్టణంలోని సెయింట్‌పాల్, భావన, క్రీసెంట్ తదితర ప్రైవేట్ స్కూళ్లలో రేకులషెడ్డులో పాఠశాలలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు.

న్యాయానికి ధనిక, పేద తేడా ఉండదు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



ఉదిరిపికొండ తండాలో మాట్లాడుతున్న జడ్జి శివప్రసాద్ యాదవ్

కూడేరు: న్యాయానికి ధనిక, పేద అనే తేడా ఉండదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్ అన్నారు. మంగళవారం ఉదిరిపికొండ తండాలో గిరిజనులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలు అమలుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్జి శివప్రసాద్ యాదవ్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శంకర్ హాజరయ్యారు. జడ్జి మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత సేవలపై గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్యా, ఈఓఆర్డీ రాధాకృష్ణ, పీఆర్ ఏఈ రమణయ్య, ఏపీఓ తులసి ప్రసాద్, ఎంఈఓ మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిద్ది వద్ద చిరుత సంచారం

కల్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామం సమీపంలోని కొండపై చిరుత కనిపించింది. మంగళవారం స్థానిక వ్యవసాయ తోటల్లో పనులకు వెళ్తుండగా కొండపై చిరుత కనిపించింది. దీంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. ఒంటిమిద్ది, బోరంపల్లి పరిసర వ్యవసాయ ప్రాంతాల్లో సుమారుగా 4,5 చిరుతలు తిరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.

సర్వసభ్యసమావేశం వాయిదా

గుమ్మఘట్ట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఎంపీటీసీ సభ్యుల కోరం లేకపోవడంతో సమావేశాన్ని బుధవారానికి వాయిదా వేసినట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీల వితరణ

గుమ్మఘట్ట: మండలంలోని నేత్రపల్లి అంగన్‌వాడీ కేంద్రం, 74 ఉడేగోళం అంగన్‌వాడీ కేంద్రాలకు క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కుర్చీలను మంగళవారం అందించారు. జంతువుల ఆకృతుల్లో ఉన్న 30 రకాల కుర్చీలను అంగన్‌వాడీ కేంద్రాలకు వితరణ చేశారు. సర్పంచ్ వినూత, ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్లు అంజినమ్మ,ఈశ్వరమ్మ,అంగన్‌వాడీ కార్యకర్త మంజుళ, సంస్థ ఆర్ఎం గౌసర్.ఏఎం గంగాధర్, బీఎం రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈనెల 25న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పార్టీ కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేశారు. జాబ్‌మేళాకు టెన్త్, ఇంటర్ నుంచి డిగ్రీ, ఐటీఐ, బీటెక్ పాస్ అయిన విద్యార్థులు హాజరుకావాలన్నారు.

24న అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

కళ్యాణదుర్గం: ఈనెల 24న కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళ్యాణదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకే చేరుకోవాలన్నారు.

భూసమస్యల పరిష్కారానికి 125 అర్జీలు

కూడేరు: మండల పరిధిలో సమగ్ర భూరీసర్వే పూర్తయిన తిమ్మాపురం, ఎంఎంహళ్లి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు భూ సమస్యల పరిష్కారానికి మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. తిమ్మాపురంలో భూసమస్యల పరిష్కారం కోసం 100 అర్జీలు, ఎంఎంహళ్లిలో 25 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ మహబూబ్ బాషా మాట్లాడుతూ నిబంధనల మేరకు భూసమస్యలన్నింటికీ పరిష్కార మార్గం చూపుతామన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, సర్వేయర్ ఆయూషా సిద్దిక్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు ప్రజా ప్రతినిధులు పనిచేయాలని ఎంపీపీ మారుతమ్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మారుతమ్మ, ఎంపీడీవో రామచంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధాన సమస్యలపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలన్నారు. వర్షాకాలంలో గ్రామాల్లో నీరు ఎక్కువగా నిల్వ ఉండటంవల్ల దోమలు ఎక్కువై, ప్రజలు అనారోగ్యంబారిన పడే అవకాశం ఉందన్నారు. వైస్ ఎంపీపీ లక్ష్మీ కాంతమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, ప్రజాప్రతినిధులు, అధికారలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నార్త్ స్కూల్ విద్యార్థులు ఎంపిక

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ క్రీడాపోటీలకు నార్త్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు చల్లా కిరణ్ చౌదరి తెలిపారు. ఈనెల 19న జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన అండర్-19 హ్యాండ్ బాల్ జిల్లా ఎంపిక పోటీల్లో నార్త్ స్కూల్ విద్యార్థులు సాయి, చరణ్, సాత్విక్ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 25 నుంచి 27 వరకు విజయనగం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారని హెచ్ఎం గాయత్రి తెలిపారు. ఏపీటీఏస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

విడపనకల్లు: కర్ణాటక నుంచి హావళిగి తరలిస్తున్న ఐదు క్వార్టర్ బాక్సులు, 480 హైవార్డ్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, సబ్ ఇన్‌స్పెక్టర్ వీరస్వామి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సుహాసిని తెలిపారు. మంగళవారం మద్యం తరలిస్తుండగా హావళిగి సరిహద్దులో ఏర్పాటు చేసిన ఓల్డ్ చెక్‌పోస్టు వద్ద పాల్తూరు వన్నూరుస్వామి, గోవిందవాడ అనిల్‌కుమార్‌ని పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి గ్రామసభలు

కణేకల్లు: భూ సమస్య పరిష్కారానికి ఈనెల 23 నుంచి 28 వరకు వివిధ గ్రామాల్లో భూ రీసర్వేపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఫణికుమార్ తెలిపారు. 23న తుంబిగనూరు, యర్రగుంట, 24న బిదరుకొంతం, గెనిగెర, 25న రచ్చుమర్రి, గరుడచేడు, 26న మాల్యం, ఎన్.హనుమాపురం, 28న సొల్లాపురంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు గ్రామ సభలు జరుగుతాయన్నారు.

పంట సాగులో రైతులకు మెలకువలు

విడపనకల్లు: మండలంలోని మాళాపురం, పెద్దకొట్టాలపల్లిలో ఏఓ పెన్నయ్య ఆధ్వర్యంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటను పరిశీలించి, పంట సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, వీఏఏ, తదితర రైతులు పాల్గొన్నారు.

హిందీ అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం

ఉరవకొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సీనియర్ హిందీ అధ్యాపకురాలుగా పని చేస్తున్న ఎస్.షానవాజ్‌బేగంకు అమెరికన్ గ్లోబల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. మంగళవారం చెన్నైలో జరిగిన డాక్టరేట్ ప్రదానోత్సవంలో షానవాజ్‌బేగం ఈపురస్కారం అందుకున్నారు. ప్రొఫెసర్ అనురాధ జయరామన్ కింద ఫిలాసఫీ విజయవంతంగా పూర్తి చేసినందుకు డాక్టరేట్ అందుకున్నారు. చెన్నై హైకోర్టు జడ్జి బాలకృష్ణ నాయక్ చేతుల మీదుగా శానవాజ్ బేగం పురస్కారం అందుకున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడ మేమనగా మా కక్షిదారుడయిన కె. ఆర్. జగన్నాథ్ తండ్రి గురుస్వామి, నివాసం : ఓ.సి. కాలనీ, బెళుగుప్ప గ్రామం మరియు మం॥ అనువారు 1) కె. గంగమ్మ భర్త గురుస్వామి 2) కె. నారాయణమ్మ తండ్రి గురుస్వామి, 3) కె. ఓబిరెడ్డి తండ్రి కె. నాగిరెడ్డి 4) కె. లక్ష్మీదేవి భర్త సత్య నారాయణరెడ్డి తండ్రి కె. నాగిరెడ్డి 5) ఉప్పర పవన్ కుమార్ తండ్రి ఉప్పర శ్రీనివాసులు 6) కేతిరెడ్డి నాగరత్నమ్మ భర్త కె. ఓబిరెడ్డి 7) కోనారెడ్డి తండ్రి వెంకటరెడ్డి 8) నాగేశ్వరరెడ్డి తండ్రి ఓబుళరెడ్డి 9) కుంబారత్ సుజాత బాయి భర్త కె. దేవేంద్ర 10) బానోత్ లక్ష్మా నాయక్ తండ్రి భీమ్యానాయక్ 11) సిరావత్ తిప్పస్వామి తండ్రి లక్ష్మా నాయక్ అందరి నివాసం బెళుగుప్ప గ్రామం మరియు మండలం, అనంతపురం జిల్లా గార్లపై మహారాజశ్రీ కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు O.S. No. 209/2024 భాగపరిష్కారం దావా వేసి యున్నారు. అందులకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తులు పై కోర్టులో పెండింగులో వున్నవి. కావున ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై వారితో కానీ ఇతరులతో కానీ ఎటువంటి లావాదేవీలు గానీ, క్రయ, విక్రయాలు కానీ ఏ ఇతరత్రా జరిపిన అవి చట్టరీత్యా చెల్లనేరవు. ఒకవేళ ఎవరైన అతిక్రమించినచో అటువంటి వారిపైన మా కక్షిదారుడు తీసుకొనబోవు సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెల్పడమైనది.

షెడ్యూలు

అనంతపురం రి.డి. కళ్యాణదుర్గం యస్.ఆర్.డి. బెళుగుప్ప మం॥, బెళుగుప్ప గ్రామపొలంలోని ఆస్తి వివరం
1) సర్కారు ఖుష్కి, సర్వే నెం.601-1, ఎ.సి. 6.45 out of this ఎ.సి. 3.36
2) సర్కారు ఖుష్కి, సర్వే నెం.306-1, ఎ.సి. 30.06 పైకి ఎ.సి. 7.88
సర్కారు ఖుష్కి సర్వే నెం. 317, ఎ.సి. 07.88 పైకి ఎ.సి.6.12, ప్లాట్ నెం.58
3) సర్కారు ఖుష్కి సర్వే నెం. 325-1ఎ, డోర్ నెం.1/26, అసెస్‌మెంట్ నెం.1091, మెజరింగ్ ఎ.సి.0.02.

పుట్టపర్తి ప్రభాకరరెడ్డి, అడ్వకేట్, అనంతపురము. సెల్ : 9849250377